
సాక్షి
పల్నాడు

శుక్రవారం, 11, ఏప్రిల్, 2025



శిలువ పాదయాత్ర

నాదెండ్ల: కనపర్రు గ్రామంలో తపస్సు కాలం సందర్భంగా గురువారం మరియ, యేసోబు దేవాలయం నుంచి బాలయేసు పుణ్యక్షేత్రం వరకు విశ్వాసులు శిలువ పాదయాత్ర నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 515.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైద్యశాలలో అన్నదానం

మాచర్లరూరల్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం అన్నదానం నిర్వహించారు. కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు గవర్నర్ అబ్దుల్ నజీర్ చీరాల రాక

చీరాల టౌన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం చీరాల వస్తున్నారని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు గురువారం తెలిపారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పర్యటనకు వస్తున్నారని రాజ్ భవన్ నుంచి సమాచారం అందడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు గవర్నర్ వాడరేవులోని ఐటీసీ అతిథి గృహానికి చేరుకుని బస చేస్తారని, శనివారం విజయవాడ రాజ్‌భవన్‌కు ప్రయాణమవుతారని సమాచారం అందించారు. ఈ మేరకు ఆర్డీఓ చంద్రశేఖరనాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గవర్నర్ వ్యక్తిగత పర్యటన నేపథ్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఎయిమ్స్‌లో కార్డియాక్ ఐసీయూ విభాగం ప్రారంభం

గుండె జబ్బు రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు



మంగళగిరి: నగర పరిధిలోని ఎయిమ్స్‌లో గురువారం నూతనంగా కార్డియాక్ ఐసీయూ విభాగాన్ని ప్రారంభించారు. ఇప్పటికే కార్డియాక్ విభాగంలో యాంజియోప్లాస్టీతో పాటు అన్ని రకాల సేవలందుతున్నాయి. అయితే, ఐసీయూ విభాగం లేకపోవడంతో గుండె సంబంధిత రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. గుండె సంబంధిత రోగులకు అన్ని రకాల వైద్య సేవలతో ఐసీయూ విభాగం అందుబాటులోకి రావడంతో రోగులకు ఎంతో మేలు జరుగుతుందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

కుడికాలువకు నీటి విడుదల నిలుపుదల




విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు గురువారం నీటిని నిలుపుదల చేశారు. సాయంత్రం 4 గంటలకు నీటిని అధికారులు పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 515.30 అడుగుల వద్ద ఉంది. ఇది 140.8451 టీఎంసీలకు సమానంగా ఉంది. ఇక్కడ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 841 క్యూసెక్కులు విడుదలవుతుంది.

దుర్గమ్మ సన్నిధిలో ఎన్నికల కమిషనర్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీ, తెలంగాణ ఎన్నికల కమిషనర్లు గురువారం దర్శించుకున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ ఇంద్రకీలాద్రికి విచ్చేయగా ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలతో వారిని సత్కరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన డి. మాల్యాద్రి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,11,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ అధికారి లక్ష్మణ్ దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

'పచ్చ'పాతం.. ప్రభలం

- వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై వివక్ష
- బల్లికురవ మండలంలో ఈర్లగంగమ్మ తిరునాళ్ల
- ప్రభలు పెట్టుకునేందుకు అనుమతి కోరిన ఇరుపార్టీల నేతలు
- పచ్చపార్టీ వారికే అనుమతులిచ్చిన ఎస్‌ఐ నాగరాజు
- ఎస్‌ఐ మాటే మా మాట అంటున్న ఉన్నతాధికారులు
- నాలుగు రోజులముందు అనుమతి ఇచ్చి బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ
- నాగరాజు విధుల్లో చేరగానే అనుమతి రద్దు
- ఎస్‌ఐ నాగరాజును హుటాహుటిన బల్లికురవకు తెచ్చిన మంత్రి అనుచరులు
- వేమవరం జంటహత్యల కేసు రాజీ కోసమేనన్న ప్రచారం
- గతంలో బల్లికురవ ఎస్‌ఐగా పనిచేసిన నాగరాజు

పసుపు చొక్కాలకు పోలీసుల సెల్యూట్



నక్కబొక్కలపాడు వద్ద పచ్చపార్టీ జెండాలతో ప్రభల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కూటమి పాలనలో కొందరు పోలీసు అధికారులు మరింతగా రెచ్చిపోతున్నారు. అధికారపార్టీ నేతల అండచూసుకొని పెట్రేగిపోతునారు. ఖాకీ చొక్కాలపై పచ్చకండువాలు కప్పుకొని విర్రవీగుతున్నారు. నిన్న అనంతపురం జిల్లా రామగిరి ఎస్‌ఐ సుధాకర్ ఏకంగా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనే నోరుపారేసుకుంటే తాజాగా బాపట్ల జిల్లా బల్లికురవ ఎస్‌ఐగా సోమవారం విధుల్లో చేరిన నాగరాజు వైఎస్సార్ సీపీ నేతలు పోలీసు స్టేషన్ ఆవరణలోకి కూడా రావద్దంటూ హుకుం జారీ చేశారు. పబ్లిక్ సర్వెంట్‌గా వున్న ఎస్‌ఐ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతుండగా విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వారు స్పందించడం లేదు. ఎస్‌ఐ తీరుతో బల్లికురవ ప్రాంతంలో మళ్లీ ఫ్యాక్షన్ గొడవలు తలెత్తే ప్రమాదముందని ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేమవరం హత్యకేసు రాజీ కోసమే..

ఇదే మండలం వేమవరంలో 2017లో మేనెల 18న కరణం బలరామకృష్ణమూర్తి అనుచరులు గోరంట్ల అంజయ్య, వేగినేని రామకోటేశ్వరరావులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుచరులు 13 మంది కలిసి పథకం ప్రకారం హత్యచేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ దాడిలో గోరంట్ల వెంకటేశ్వర్లు, వేగినేని వీరరాఘవయ్య తీవ్ర కత్తిపోట్లకు గురై కొన ప్రాణంతో బయటపడ్డారు. ఆరోజు నుంచి ఈ రోజువరకూ వేమవరంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. ప్రస్తుతం కేసు చివరిదశకు చేరుకుంది. బాధితులు హత్యచేసిన వారికి శిక్ష పడాల్సిందేనని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే మంత్రి గొట్టిపాటి అనుచరులకు శిక్షపడే అవకాశం లేకపోలేదు. దీంతో ఈ కేసులో బాధితులను బెదిరించైనా సరే బయటపడేందుకు మంత్రి అనుచరులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే 2017 ప్రాంతంలో బల్లికురవ ఎస్‌ఐగా పనిచేసిన నాగరాజును తిరిగి ముండ్లమూరు నుంచి హుటాహుటిన బల్లికురవ స్టేషన్‌కు పిలిపించినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

అనుమతులు ఉన్నా..

వాస్తవానికి వైఎస్సార్ సీపీ నేతలు వారం క్రితం బల్లికురవ ఎస్‌ఐ జీవీ చౌదరికి దరఖాస్తు చేసుకోగా ఆయన సంతమాగులూరు సీఐ కలిసి ప్రభలకోసం అనుమతి ఇచ్చారు. ఈ విషయం డీఎస్పీకి సైతం తెలుసు. ఇదే విషయాన్ని వైఎస్సార్ సీపీ నేతలు డీఎస్పీ దృష్టికి తీసుకరాగా అనుమతి తాను పంపిస్తానని ఎస్‌ఐని కలువాలని చెప్పడంతో వారు తిరిగి బల్లికురవ ఎస్‌ఐని కలువగా ఎవరు చెప్పినా అనుమతి ఇవ్వనని తేల్చి చెప్పారు. మంత్రి అనుచరుల అండతో ఎస్‌ఐ డీఎస్పీ మాటలను సైతం ఖాతరు చేయలేదని తెలుస్తోంది. దీంతో గురువారం సైతం వైఎస్సార్ సీపీ నేతలు మరోమారు డీఎస్పీని కలువగా తాను ఎస్‌ఐ చెప్పిన ప్రకారమే నడుచుకుంటామని చెప్పడం అందరినీ నివ్వెరపరిచింది. అదే సమయంలో పార్టీలు, జెండాలకతీతంగా తిరునాళ్లు నిర్వహించుకోవాలని, పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు కడితే కేసులు పెడతామని చెప్పినా పచ్చపార్టీవారు మాత్రం ప్రభల ప్రాంతంలో ఏకంగా టీడీపీ జెండాలు, నేతల ఫొటోలు ఏర్పాటు చేశారు. పచ్చపార్టీ వారికి మాత్రమే ఎస్‌ఐ అనుమతులివ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆది నుంచి వివాదాస్పదమే..

బల్లికురవ ఎస్‌ఐ నాగరాజు పనితీరు మొదటి నుంచీ వివాదాస్పదమే. సోమవారం ఆయన మరోమారు బల్లికురవ ఎస్‌ఐగా విధుల్లో చేరిచేరడంతోనే వైఎస్సార్ సీపీ శ్రేణులే టార్గెట్‌గా వ్యవహరిస్తున్నారు. మండలంలోని నక్కబొక్కలపాడులో ఈర్ల గంగమ్మ జాతర సందర్భంగా ప్రభల అనుమతుల విషయంలోనూ ఏకపక్షంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఈ నెల 12న జాతర వున్నా గురువారం నుంచే ఈ ప్రాంతంలోని నక్కబొక్కలపాడుతోపాటు కొనిదెన, మల్లాయిపాలెం తదితర గ్రామాల్లో తిరునాళ్లు మొదలయ్యాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రభలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ప్రభలు కట్టుకునేందుకు ఇరుపార్టీ మద్దతు దారులు అనుమతికోసం పోలీసులకు దరఖాస్తుచేయగా పచ్చపార్టీ వారికి 6 ప్రభల ఏర్పాటుకు అనుమతులిచ్చిన ఎస్‌ఐ నాగరాజు వైఎస్సార్ సీపీ వారికి అనుమతి నిరాకరించారు. ఇక నుంచి స్టేషన్‌లోకి రావద్దని వైఎస్సార్ సీపీ వారికి హుకుం జారీ చేశారు. మీరు ఎవరికి చెప్పుకున్నా అనుమతి ఇచ్చేదిలేదన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు కృష్ణ తదితరులు బాపట్ల డీఎస్పీని కలిసి విషయం చెప్పారు.

అధైర్యపడొద్దు.. న్యాయం చేస్తాం

- వీపీ సౌత్‌లో వృద్ధ దంపతులను పరామర్శించిన జిల్లా ఎస్పీ
- తమ కొడుకు పట్టించుకోవడం లేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



వృద్ధ దంపతులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

విజయపురి సౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో గురువారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పర్యటించారు. స్థానికంగా నివాసం ఉంటున్న అరికట్ల బ్రహ్మారెడ్డి, విజయ లక్ష్మి వృద్ధ దంపతులు ఇటీవల తమ సమస్యను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో, వారి ఇంటికి వెళ్లిన ఎస్పీ వివరాలు తెలుసుకున్నారు. ఆస్తులను అమ్మి తమ కొడుకు అంజిరెడ్డిని ఉన్నత చదువులు చదివించడంతో యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డాడని, అప్పటినుంచి తమను పట్టించుకోవడం మానేశాడని ఎస్పీ వద్ద వృద్ధ దంపతులు వాపోయారు. అనారోగ్యంతో బాధపతున్నా కొడుకు పట్టించుకోవడం లేదన్నారు. ఇల్లు గడవక, అనారోగ్యంతో బాధపడలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు ఎస్పీకి తెలిపారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులో కేసు వేస్తే భరణం ఇవ్వాలని కోర్టు తీర్పు చెప్పిందన్నారు. కోర్టు ఆదేశాలను కూడా తమ కొడుకు పాటించలేదని ఎస్పీ కి తెలిపారు. ఎస్పీ స్పందిస్తూ.. న్యాయం చేస్తానని ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎస్పీ వెంట మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్‌ఐ మహమ్మద్ షఫీ ఉన్నారు.

టీడీపీ గూండాల దాడులు

- జూలకల్లులో వైఎస్సార్ సీపీ నేత చిన అంజిరెడ్డిపై విచక్షణారహితంగా దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స



ఆస్పత్రిలో చిన అంజిరెడ్డి

పిడుగురాళ్ల రూరల్: పల్నాడు జిల్లాలో వరుస దాడులు చేస్తూ తెలుగుదేశం పార్టీ గూండాలు భయోత్పాతానికి గురిచేస్తున్నారు. ఎవరినీ వదలం, మీ అంతు చూస్తామంటూ పెద్ద పెద్దగా అరుస్తూ దాడులకు పాల్పడుతున్నారు. మండలంలోని జూలకల్లు గ్రామంలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చినఅంజిరెడ్డి సచివాలయం వద్ద కూర్చుని స్థానికులతో మాట్లాడుతున్నాడు. ఇదే అదనుగా టీడీపీ గూండాలు ఒక్కసారిగా అంజిరెడ్డిని చుట్టుముట్టి, కర్రలు, ఇనుపరాడ్‌లతో మూకుమ్మడి దాడికి పాల్పడ్డారు. చిన అంజిరెడ్డి కేకలు వేయడంతో స్థానికులు రావడంతో టీడీపీ గూండాలు అక్కడి నుంచి పరారయ్యారు. దాడిలో చిన అంజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పిడుగురాళ్లలోని ఆసుపత్రికి తరలించారు.

ఒకే గ్రామంలో వరుస దాడులు

మొన్న మర్రి లక్ష్మారెడ్డి, నిన్న నాగిరెడ్డి గంగిరెడ్డి, ఈరోజు చిన అంజిరెడ్డిపై వరుసగా టీడీపీ గూండాలు దాడులు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని వరుస దాడులు చేస్తూ జూలకల్లు గ్రామంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఉండడానికి వీల్లేదంటూ, దాడులు చేస్తూ భయానకాన్ని సృష్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గాయపడినవారిపైనే కేసులు నమోదు చేస్తూ, టీడీపీ గూండాలకు జై కొట్టడం పల్నాడు పోలీసులకే చెల్లింది.

పట్లవీడు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

- యథేచ్ఛగా తవ్వేస్తున్న టీడీపీ నేతలు
- అడ్డగోలుగా రూ.లక్షలు సంపాదించే యత్నం
- రాత్రిళ్లు వాహనాలు తిరుగుతుండటంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మట్టిలోడు టిప్పర్లను అడ్డుకున్న మండాది గ్రామస్తులు





పట్లవీడు చెరువులో అక్రమంగా మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్ (ఇన్‌సెట్) మండాది గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన వాహనాలు

వెల్దుర్తి: పట్లవీడు చెరువులో మట్టికి మంచి డిమాండ్ ఉండటంతో ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు పొక్లెయిన్ల ద్వారా అక్రమంగా మట్టిని టిప్పర్లలో నింపి ఇతరచోట్ల అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పదుల కొద్దీ టిప్పర్ వాహనాలను తెచ్చి పొక్లెయిన్ ద్వారా మట్టిని తవ్వి టిప్పర్లలో నింపి మండాది గ్రామం నడిబొడ్డున ఉన్న రోడ్డు ద్వారా ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. దీంతో గురువారం మండాది గ్రామస్తులు మట్టి అక్రమ రవాణా వాహనాలను అడ్డుకున్నారు.

అడ్డుకుని హెచ్చరించిన గ్రామస్తులు

అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఈ రహదారి ద్వారా వాహనాలు తిరగటానికి వీలు లేదని గ్రామస్తులు వాహనాలను అడ్డుకోవటంతో భారీసంఖ్యలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. రాత్రిళ్లు గ్రామం నుంచి వాహనాలు భారీ శబ్దాలుగా వెళుతుండడంతో గ్రామస్తులకు కంటిమీద కునుకు కరువైంది. దానికితోడు ఆరుబయట, రోడ్ల పక్కన మంచాలు వేసుకుని పడుకుంటుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే గ్రామం మీదుగా టిప్పర్లు తిప్పొద్దని పలుమార్లు చెప్పగా, వారి మాట చెవికెక్కించుకోని టీడీపీ నేతలు యథేచ్ఛగా మట్టి లారీలను మండాది నుంచే తిప్పడంతో ఆగ్రహించిన గ్రామస్తులు టిప్పర్‌లను అడ్డగించారు. టీడీపీ నేతలను పిలిపించి, మరోసారి తమ గ్రామం మీదుగా టిప్పర్లను తిప్పితే తీవ్ర పర్యావసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించి, టిప్పర్లు వదిలారు.

■ ఈ విషయంపై మైనర్ ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా పట్లవీడు చెరువులో మట్టిని తరలించేందుకు ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. చెరువులో అక్రమంగా మట్టిని తరలించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రావణ వాహనంపై ఆది దంపతులు



మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆదిదంపతుల నగరోత్సవం

కనులపండువగా నగరోత్సవ సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాలలో మూడో రోజైన గురువారం శ్రీ గంగా పార్వతీ(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి రావణ వాహనంపై నగర పుర వీధుల్లో విహరించారు. ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం మూల మంత్రహవనం, సాయంత్రం ఔపాసన, బలిహరణ వంటి వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు రావణ వాహనాన్ని అధిష్టించిన ఆది దంపతులకు ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఇతర ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించి నగరోత్సవాన్ని ప్రారంభించారు. మహా మండపం నుంచి ప్రారంభమైన ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్‌రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. కోలాట బృందాలు, డప్పు కళాకారుల విన్యాసాలతో పాటు దేవస్థాన వాయిద్యాల బృందం, పంచవాయిద్యాలతో వాహనం ముందుకు సాగింది. ఆది దంపతులు నగర వీధుల్లోకి విచ్చేయడంతో స్థానిక భక్తజనం, దుకాణదారులు పూజా సామగ్రిని సమర్పించి పూజలు జరిపించుకున్నారు. ఏఈవో చంద్రశేఖర్, దుర్గారావు, ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా, భక్తజనులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- జిల్లా ఎస్పీతో కలిసి ఏర్పాట్లు పరిశీలన
- చెన్నకేశవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

మాచర్లరూరల్: చరిత్రలో పల్నాడు ప్రసిద్ధి చెందిన పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాలలో ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావులు ఆదేశించారు. గురువారం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. చెన్నకేశవుని ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని, ముఖ్యంగా 12వ తేదీన జరిగే కల్యాణ మహోత్సవం, అలాగే వేలాది మంది పాల్గొనే రథోత్సవంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అధికారులతో మాట్లాడారు.

అన్ని ఏర్పాట్లు చేయాలి..

వేసవి దృష్ట్యా తాటాకు పందిళ్లు, మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని సూచించారు. రథోత్సవానికి వచ్చే భక్తులను అంచనా వేసి దైవ దర్శనానికి ఎటువంటి ఆటంకం జరగకుండా తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను తెలుసుకొని వారికి మరింత ప్రోత్సాహం అందించాలని సూచించారు. రథం ఊరేగింపులో ఎటువంటి అవాంతరాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అధికారులకు ఘనస్వాగతం..

తొలుత కలెక్టర్, ఎస్పీలకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలుకగా వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. గురజాల ఆర్డీఓ పి.మురళీకృష్ణ, తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి గబ్రునాయక్, ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్, సీఐలు ప్రభాకర్, నఫీజ్‌బాషా, ఎస్‌ఐ సంధ్యారాణి, ఆలయ ఈఓ పూర్ణచంద్రరావు, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ సూరె యలమంద, ఉత్సవ కమిటీ సభ్యులు గాజుల గణేష్, కొమెర అనంతరాములు, చంటి, ఆలయ అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు స్వామివారి రథాన్ని పరిశీలించారు.

'హ్యాకింగ్' చిత్రం పోస్టర్ ఆవిష్కరణ

నగరంపాలెం: జిల్లా ప్రజలకు సైబర్ మోసాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం హ్యాకింగ్ సినిమా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. హ్యాకర్ల సైబర్ నేరాలపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు దర్శకులు నరేష్ దోనె, మణివరన్ తెలిపారు. ఇటీవల వచ్చిన ఏఐ ద్వారా ఫొటో ద్వారా కూడా సరికొత్త సైబర్ నేరాలను హ్యాకర్లు చేస్తున్నారని చెప్పారు. ప్రజలు వీటి బారినపడకుండా ముందస్తు జాగ్రత్తలను చిత్రం ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు. అంజలి సమర్పణలో అనుపమ ఆర్ట్స్ పతాకంపై రావూరి సురేష్‌బాబు చిత్రం నిర్మిస్తున్నారని చెప్పారు. కొన్ని సన్నివేశాలను కొండవీడులో చిత్రీకరించామని, నటిగా ముంబైకు చెందిన కావ్య దేశాయ్ నటిస్తున్నట్లు వారు తెలిపారు.



క్లుప్తంగా

ఆదర్శ పాఠశాలలో ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష



జెట్టిపాలెం (రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల (ఏపీ మోడల్ స్కూల్)లో 2025–26 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. పాపయ్య తెలిపారు. గురువారం ఆయన పాఠశాలలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రవేశ పరీక్షలో మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారన్నారు. ఏప్రిల్ 20న జరగవలసిన ప్రవేశ పరీక్ష ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక పాఠశాలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 91829 58496 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

జాతీయ అవార్డుకు విద్యాశాఖాధికారి ఎంపిక



పెదకూరపాడు: పెదకూరపాడు అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న ఏకుల ప్రసాదరావు 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డు'కు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య గురువారం తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రసాదరావు ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుచేశారు. ఈ నెల 13వ తేదీన గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరావును పలువురు ఉపాధ్యాయులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

బావిలో పడి మహిళ మృతి



నకరికల్లు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యవసాయ బావిలో పడడంతో వివాహిత మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని చల్లగుండ్ల గ్రామం సమీపంలో చీరాల ఓడరేవు రహదారిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా, షేక్ రమీజా (25) దంపతులు. వీరు తమ ఏడు నెలల పాపను తీసుకొని రమీజా పుట్టిల్లు అయిన మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శుభకార్యానికి వచ్చారు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ముప్పాళ్లకు తిరుగు పయనమయ్యారు. చల్లగుండ్ల సమీపంలో రోడ్డుపై అడ్డంగా పాము రావడంతో బెదిరిపోయిన రమీజా తన భర్త నాగుల్‌మీరా చెయ్యి గట్టిగా పట్టుకోవడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. దీంతో ముగ్గురూ రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయారు. వారి కేకలకు రోడ్డుపై వెళ్లేవారు గమనించి ముగ్గురిని వెలికితీశారు. అప్పటికే రమీజా ఊపిరాడక మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు.

లింగారావుపాలెంలో 'నాటికల' పండుగ

- రేపటి నుంచి జాతీయ స్థాయి పోటీలు
- అభిమానులకు 3 రోజులపాటు కళావిందు



కొండవీటి కళా పరిషత్ కళా వేదిక

యడ్లపాడు: ఆ పల్లె కళలకు నిలయం. కళలతోనే సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ సాధ్యమని అక్కడి ప్రజలు నమ్మారు. అందుకే కళలకు జీవం పోశారు. రెండున్నర దశాబ్దాల కిందటే కొండవీడు కళా పరిషత్‌ను నెలకొల్పారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం వాసుల ప్రత్యేకత ఇది. పరిషత్‌కు గౌరవ అధ్యక్షుడిగా సినీనటులు పోసాని కృష్ణమురళి, అధ్యక్షుడిగా కట్టా శ్రీహరిరావు, ఉపాధ్యక్షులుగా తోకల సాంబశివరావు, నంబూరు వీరాంజనేయులు, కార్యదర్శిగా మండెపూడి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులుగా కట్టా వీరాంజనేయులు, నంబూరు శివరామకృష్ణ, నంబూరు ఉల్లయ్య, జరుగుల రామారావు ఉన్నారు. 1997లో స్థాపించిన ఈ పరిషత్ ఏటా మూడు రోజులపాటు సామూహిక కళా ఉత్సవాలను నిర్వహిస్తోంది. కరోనా కాలంలో మినహా ఇవి కొనసాగాయి. ప్రస్తుతం 26వ జాతీయ స్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 12,13,14వ తేదీల్లో నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది 9 నాటికలు ప్రదర్శితం కానున్నాయి. ఎందరో రాజులు, రారాజులు పరిపాలించిన తెలుగు వారి వైభవానికి నిలువెత్తు సాక్ష్యమైన అద్దంకి రెడ్డి రాజుల రెండో రాజధాని 'కొండవీటి గిరిదుర్గం' ఈ గ్రామానికి కూతవేటు దూరంలోనే ఉంది. తమ కలాన్ని హలంగా చేసి సాహితీ క్షేత్ర స్థానాన్ని సస్యశ్యామలం చేసిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు, ప్రజాకవి వేమన, శ్రీకృష్ణదేవరాయలు ఈనేలపై నడయాడినవారే. కాకతీయులు, రెడ్డిరాజుల పాలనలో సంగీత, సాహిత్య, శిల్పకళల్లో తెలుగు తేజాన్ని అంబరానికి చేర్చిన అవని కొండవీడు. కాబట్టే ఈ పరిషత్‌కు ఆ పేరును పెట్టారు. నాటికల పోటీలతోపాటు కొండవీడు కీర్తిని వ్యాపింపజేస్తున్నారు.

అంకితభావానికి నిదర్శనం



నేటి మహిళలకు టీవీ సీరియల్స్ చూసే సమయంలో కరెంట్ పోతే కలకలమే. కానీ ఈ 3 రోజుల నాటికల పండుగకు గ్రామంలోని కేబుల్ ప్రసారాల్ని స్వచ్ఛందంగా నిలిపివేయడం ఇక్కడి ప్రత్యేకత. ఇందుకు ఎవ్వరూ అభ్యంతరం చెప్పకపోవడమే ఈ ఊరి గొప్పతనం.

– కట్టా శ్రీహరిరావు, పరిషత్ అధ్యక్షుడు

భావితరాలకు అందించడమే లక్ష్యం



భావితరాలకు కళా సంస్కృతిని అందించేందుకు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు నెలకుదిటి రామచంద్రయ్య ఆధ్వర్యంలో పరిషత్ ఆవిర్భావం జరిగింది. ఇది 26 ఏళ్ల కళల ప్రయాణం. ప్రతి ఏడాది కచ్చితంగా నిర్వహించే నాటికల పోటీలు అటు కళాకారులకు, ఇటు కళాభిమానులకు ప్రేరణగా మారాయి.

– మండెపూడి శ్రీనివాసరావు, పరిషత్ కార్యదర్శి

మెరుగ్గా 'చెత్త నుంచి సంపద సృష్టి'



మాట్లాడుతున్న ఈడీ అర్జునరావు

సత్తెనపల్లి: స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర ఆశయ సాధనలో భాగంగా రాష్ట్రంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అర్జునరావు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామలోని ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు, క్లాప్ మిత్రాలు పారిశుద్ధ్యం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తలను వేరు చేసి అందించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలని కోరారు. అనంతరం నందిగామ క్లాప్ మిత్రాలతో సమావేశమై, పలు సూచనలు చేశారు. గ్రామంలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం సత్తెనపల్లి, రాజుపాలెం, నకరికల్లు, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు చెందిన స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్‌లతో ఈడీ భేటీ అయ్యారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, నిర్వహణ అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో బండి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి ఆర్.శ్రీనివాసరెడ్డి, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆళ్ళ సాంబయ్య, ఐటీసీ రీసోర్స్‌పర్సన్ చెంబేటి బొల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భావన, ఏపీఎం సమాధానం, పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, కృష్ణ ప్రసాద్, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మాచర్లకు చెందిన నాగెండ్ల యోహాన్‌ను క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగాను, పెదకూరపాడుకు చెందిన ఆలా లక్ష్మీనారాయణ, ఎక్కిరాల మురళి, గత్రం కాంతారావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డిలను పంచాయతీరాజ్ వింగ్, ఆర్‌టీఐ వింగ్, వీవర్స్ వింగ్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షులుగా నియమించారు.

లబ్ధి చేకూర్చిన వారిపై నిందలు సరికాదు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: రాజకీయ లబ్ధి చేకూర్చిన వారిపై నిందలు మోపటం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర మంత్రి అమిత్‌షాకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు లేఖ రాస్తూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సీబీఐ కేసులు, ఈడీ కేసులు ఉన్నాయనటం సరికాదన్నారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఎంపీగా గెలిచి ఇలా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన వారిని, వారి ద్వారా లబ్ధి పొంది ఇలా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో నడిరోడ్డుపై హత్యా రాజకీయాలు చేస్తున్న తీరుపై, బార్ షాపు యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్న వైనంపై నిలదీశారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్రానికి లేఖ రాయాలని ఆయన కోరారు.

బాల్య వివాహం నిలిపివేత

నాదెండ్ల: బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకుని కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చిన సంఘటన ఓ గ్రామంలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఈ ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసింది. చిలకలూరిపేట మండలం చినరాజాపేట గ్రామానికి చెందిన 22 ఏళ్ల నరేంద్రతో ఈ నెల 13న బాలిక వివాహాన్ని పెద్దలు నిర్ణయించారు. బాలిక తండ్రి చనిపోగా, తల్లి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. బాలిక వివాహ సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో స్వరూపారాణి, డీసీటీవో ప్రశాంత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, సచివాలయ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గర్భిణులు, బాలింతలు సేవలను ఉపయోగించుకోవాలి



నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల కోసం ప్రవేశ పెట్టిన కిల్కారి సేవలను ఉపయోగించుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 012444 51660 అని, కాల్ వచ్చినపుడు ఎత్తి పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారన్నారు. తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

వసూళ్ల పేరిట వేధింపులకు గురి చేస్తే చర్యలు

- బాపట్ల పట్టణ సీఐ రాంబాబు
- ప్రైవేటు బ్యాంకర్లు, ఫైనాన్స్ సంస్థల ఏజెంట్లతో సమావేశం



మాట్లాడుతున్న పట్టణ సీఐ రాంబాబు

బాపట్లటౌన్: ఫైనాన్స్ సొమ్ము వసూళ్ల పేరుతో వేధింపులకు పాల్పడితే సహించేది లేదని పట్టణ సీఐ రాంబాబు హెచ్చరించారు. బాపట్ల పట్టణం, రూరల్ పరిధిలోని మైక్రో ఫైనాన్స్, ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ వ్యాపారాల నిర్వాహకులు, రికవరీ ఏజెంట్లతో పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ రుణగ్రహీతలు తీసుకున్న లోన్లు సకాలంలో చెల్లించకపోతే నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు. రుణగ్రహీతలను ఎలాంటి వేధింపులకు గురి చేయరాదన్నారు. కంపెనీ ద్వారా లీగల్‌గా నోటీసులు అందజేసి కోర్టు జారీచేసే ఆదేశాల మేరకు నడుచుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి రుణగ్రహీతలను ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు, సర్కిల్ సీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ విప్లవాత్మక మార్పు



మాట్లాడుతున్న జేసీ సూరజ్ ధనుంజయ్

నరసరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో కంప్యూటరైజేషన్ అనేది ఒక సాంకేతిక మార్పు మాత్రమే కాదని, అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవాత్మకమైన పురోగతి అని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా స్థానిక ప్రకాష్‌నగర్‌లోని సహకార బ్యాంకు ఆవరణలో గురువారం పీఏసీఎస్‌లో కంప్యూటరీకరణ అనే అంశంపై పీఏసీఎస్ సీఈవోలు, బాంక్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఆడిటర్లకు నిర్వహించిన జిల్లా స్థాయి సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో గ్రామీణ రైతుల ఆర్థిక జీవన విధానానికి బలమైన మద్దతుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు నిలుస్తున్నాయని చెప్పారు. ఇవి రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు, ఇతర సదుపాయాలు అందించే విధంగా పనిచేస్తున్నాయని అన్నారు. భారత ప్రభుత్వం సహకార రంగ అభివృద్ధికి రూ.2,516కోట్ల నిధులు కేటాయించి 63,000 పీఏసీలను కంప్యూటరైజ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం, నెట్‌వర్కింగ్ ద్వారా రాష్ట్ర, జాతీయ బ్యాంకులతో అనుసంధానం కల్పించడం జరుగుతాయని అన్నారు. జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ కంప్యూటరీకరణ వారికి మేలు చేస్తుందన్నారు. గుంటూరు కేంద్ర సహకార బ్యాంకు జీఎం అజయ్‌కిషోర్, జిల్లా ఆడిట్ అధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ పాత్ర కీలకం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ



రక్తదానం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

గుంటూరు వెస్ట్: భూ సమస్యల పరిష్కారంలో సర్వే శాఖ పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. జాతీయ సర్వే దినోత్సవంలో భాగంగా ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం భవనంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ భూమిపై మమకారం ఉంటుందని తెలిపారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 10న జాతీయ సర్వే దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, 53 మంది సర్వే శాఖ ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన సర్వేయర్లకు ఇన్‌చార్జి కలెక్టర్‌తోపాటు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మల్లికార్జునరావు, కార్యదర్శి ఆర్.మల్లికార్జునరావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ, పి.వి. భావన్నారాయణ, సాంబశివరావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి 10 మందికి గాయాలు



తెనాలి రూరల్: కుక్కలను తప్పించబోయి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ సహా 10 మంది గాయాలపాలయ్యారు. తెనాలి వైకుంఠపురం సమీపంలో గురువారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన ధర్మ, యాకోబు, బెంజమిన్, మరియమ్మ, శ్యామల, వెంకటరత్నం, అమ్మారావు, సుశీల, సైమాన్ రాయి పని కోసం తెనాలి మండలం కొలకలూరుకు కొద్ది రోజులుగా వస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మూల్పూరుకే చెందిన ఆటో డ్రైవర్ మూల్పూరి నరేష్ ఆటోలో వీరు వస్తున్నారు. తెనాలి వైకుంఠపురం సమీపంలో రహదారిపై మూడు కుక్కలు అడ్డు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టడంతో అందులోని 10 మంది గాయపడ్డారు. 108లో వారిని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో యాకోబు పరిస్థితి విషమంగా ఉండంతో గుంటూరు పంపారు. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలకు అంకితభావం ముఖ్యం

సత్తెనపల్లి: స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు అంకిత భావంతో పని చేయాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జియావుద్దీన్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సబ్ జైల్, ఏపీటీ చిల్డ్రన్ హోం, సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల గ్రామంలోని హౌస్ ఆఫ్ ఆనియన్స్ అనే అనాథ పిల్లల ఆశ్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సబ్ జైల్‌లో ఉన్న నిందితులకు హక్కుల గురించి తెలిపారు. వారికి అందుతున్న సౌకర్యాలను, ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీటీ అనాథ పిల్లల హాస్టల్‌ను సందర్శించారు. అక్కడ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల గ్రామంలో గల హౌస్ ఆఫ్ ఆనియన్స్ అనే అనాథ పిల్లల ఆశ్రమంలో రికార్డులను పరిశీలించారు. ఆయనతోపాటు లీగల్ ఎయిడ్ న్యాయవాది బీఎల్ కోటేశ్వ రరావు, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, కోర్టు సిబ్బంది ఉన్నారు.

సమాజ హితమే సాహిత్యం పరమావధి



బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ సుబ్బారావు



డీఐజీ విజయారావుకు సత్కారం

తాడేపల్లి రూరల్: మాతృ భాషలు మృత భాషలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షింపబడాలని తెలిపారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బీఏ (ఐఎఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం ''ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదాలు – సమాలోచన'' అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావధి అని పేర్కొన్నారు. రాష్ట్ర రహదారుల భద్రతా విభాగం డీఐజీ సీహెచ్. విజయారావు మాట్లాడుతూ మాతృభాషలో సివిల్ సర్వీసెస్ రాసి లక్ష్యాన్ని సాధించడం సులువని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ ప్రచురించిన 11 సంవత్సరాల యూపీఎస్సీ పాత ప్రశ్నపత్రాలు – సమాధానాలు, విశ్లేషణతో కూడిన గ్రంథాన్ని ఆవిష్కరించి, ఉచితంగా విద్యార్థులకు అందజేశారు. వాణిజ్య పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి. రాంబాబు మాట్లాడుతూ తెలుగు ప్రధాన అంశంగా తీసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత మార్గ నిర్దేశం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర లయోలా విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు, రచయిత్రి నైనాల వాణిశ్రీ, బీఏ విభాగాధిపతి బి. శివనాగయ్య, సహాయ ఆచార్యులు అద్దంకి ప్రజాపతి, వర్సిటీ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, కె. రాజశేఖరరావు, ఎస్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె. సుబ్బారావు, బీఏ ఉప విభాగాధిపతి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

నగరంపాలెం: రాష్ట్రంలో గురువారం 17 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీ బి.వి. సుబ్బారావును ఏసీబీ డీఎస్పీగా, వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిని గుంటూరు ఉమెన్ పీఎస్ డీఎస్పీగా బదిలీ చేశారు.